సాక్షి
కాకినాడ
శుక్రవారం । 4 । ఏప్రిల్ । 2025



టోల్ బాజా!

జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనాల రుసుం వసూలు కోసం ఏర్పాటు చేసిన చేసిన టోల్‌ప్లాజాల వద్ద మరోసారి బాదుడు ప్రారంభమైంది.


8లో



వెంకన్న కల్యాణోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

వాడపల్లి వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేసి, విజయవంతంగా నిర్వహించాలని కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 10,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3 వేలు, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,300 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.40 అడుగులు ఉంది.

న్యూస్‌రీల్

భావనారాయణ స్వామి భూములను పరిశీలించిన కలెక్టర్

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలోని భావనారాయణ స్వామి దేవస్థానానికి చెందిన విలువైన భూములను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ గురువారం పరిశీలించారు. ఇదే భూములను క్రికెట్ స్టేడియం నిర్మాణం కోసం స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీ బుధవారం పరిశీలించగా.. మరుసటి రోజే కలెక్టర్ రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. రెవెన్యూ, సర్వే విభాగాల అధికారులు, ఎమ్మెల్యే నానాజీతో కలిసి దేవస్థానానికి చెందిన సుమారు 18 ఎకరాల భూములను కలెక్టర్ పరిశీలించారు. భూముల హద్దులను చూసి ఎన్ని ఎకరాలుందో నివేదిక ఇవ్వాలని సర్వే అధికారులను ఆదేశించారు. సర్పవరంలో క్రికెట్ స్టేడియం ప్రతిపాదన రావడంతో విలువైన దేవుడి భూములు 18 ఎకరాలతో పాటు దీనిని ఆనుకుని ఉన్న రైతులకు చెందిన మరో 12 ఎకరాలు కూడా సేకరించేందుకు పరిశీలన చేస్తున్నట్లు సమాచారం. భూములు ఎందుకు పరిశీలించారనే విషయాన్ని కలెక్టర్ వెల్లడించలేదు. ఎమ్మెల్యే నానాజీ మాత్రం క్రికెట్ అసోసియేషన్ ప్రతిపాదన మేరకు భూములు పరిశీలించినట్లు చెప్పారు. కలెక్టర్ వెంట జిల్లా సర్వే అధికారి సుబ్బారావు, తహసీల్దార్ కుమారి, ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్యామలకు కలెక్టర్ అభినందనలు



గోలి శ్యామలను అభినందిస్తున్న కలెక్టర్

కాకినాడ సిటీ: పెద్దాపురానికి చెందిన గోలి శ్యామల గత జనవరిలో విశాఖపట్నం నుంచి సముద్రంలో ఈదుకుంటూ కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు విజయవంతంగా చేరుకున్నారు. ఆమె సాహసాన్ని అభినందిస్తూ వరల్డ్ ఓపెన్ వాటర్ అసోసియేషన్ ప్రశంసాపత్రం అందజేసింది. ఈ నేపథ్యంలో శ్యామల జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌ను కలెక్టరేట్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. సముద్రంలో 150 కిలోమీటర్లు ఈదుతూ గమ్యాన్ని చేరుకోవడం గొప్ప విశేషమని ఆమెను కలెక్టర్ అభినందించారు.

వక్ఫ్ సవరణ బిల్లు.. రాజ్యాంగంపై దాడి



కరీం బాషా

కాకినాడ రూరల్: వక్ఫ్ సవరణ బిల్లును రాజ్యాంగంపై దాడిగా జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ కార్యదర్శి, వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్‌ఏ కరీం బాషా అన్నారు. గురువారం తన నివాసంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మత విద్వేషాలు రెచ్చగొట్టడమే బీజేపీ ప్రధాన అజెండా అని ఆరోపించారు. పార్లమెంటు ఆమోదించిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టం ముస్లింల షరియత్‌కు పూర్తి విరుద్ధమన్నారు. అన్యాక్రాంతమైన లక్షలాది ఎకరాల భూములను తిరిగి స్వాధీనం చేసుకునే విధంగా చట్టంలో ఎలాంటి మార్పూ చేయలేదని, ఇది కేవలం బడాబాబులకు దోచిపెట్టడానికేనని విమర్శించారు. సీఎం చంద్రబాబు ముస్లింలకు చేస్తున్న అన్యాయాన్ని టీడీపీలోని ముస్లిం నాయకులు, కార్యకర్తలు గ్రహించాలని బాషా కోరారు. సమావేశంలో మైనార్టీ సెల్ రూరల్ అధ్యక్షుడు కేజీఎస్ వలి, నాయకులు షేక్ సంధాని, చాంద్ బాషా, అన్సారీ బేగ్ పాల్గొన్నారు.

ఔను.. బర్డ్‌ఫ్లూతోనే కోళ్ల మరణాలు

పిఠాపురం: గత ఫిబ్రవరి 10 నుంచి 20వ తేదీ వరకూ పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లోని మూడు కోళ్లఫామ్‌లలో పెద్ద సంఖ్యలో కోళ్లు బర్డ్‌ఫ్లూ వల్లనే మృతి చెందాయని కేంద్ర ప్రభుత్వం నిర్ధారించింది. ఈ మేరకు కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి గురువారం సమాచారం వచ్చింది. ఈ విషయాన్ని గెజిట్‌లో ప్రచురించి, కోళ్లు చనిపోయిన ఫామ్‌లపై ఆంక్షలు విధించారు. కోళ్లు చనిపోయిన ఫామ్‌ల నుంచి కిలోమీటరు పరిధిని ఇన్‌ఫెక్టెడ్ జోన్‌గా, 10 కిలోమీటర్ల పరిధిని సర్వైలెన్స్ జోన్‌గా ప్రకటించి, ఆంక్షలు అమలు చేయాలని స్థానిక అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రాంతాల నుంచి కోళ్లను అమ్మడం, కొనడం, ఇతర ప్రాంతాలకు సరఫరా చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ జీఓ 122 జారీ చేశారు. అప్పట్లో పిఠాపురం, మండలంలోని కుమారపురం, చిత్రాడ, నర్సింగపురం, గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామాల్లోని ఫామ్‌లలో ఒక్కసారిగా వందలాది కోళ్లు మృతి చెందాయి. సంబంధిత కోళ్ల కంపెనీ సిబ్బంది వచ్చి, చనిపోయిన కోళ్ల శాంపిల్స్ తీసుకెళ్లారు. పశు సంవర్ధక శాఖ అధికారులు హుటాహుటిన ఆయా ఫామ్‌లను పరిశీలించారు. చనిపోయిన కోళ్ల శాంపిల్స్‌ను భోపాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్‌కు పంపించారు. అక్కడ వివిధ పరీక్షల అనంతరం ఆ కోళ్లు బర్డ్‌ఫ్లూ వల్లనే మరణించినట్లు నిర్ధారించారు.

పచ్చని చేలపై కన్నీటి వరద



ఈ ఫొటో చూడండి.. కనుచూపు మేరంతా వరద నీటిలో చిక్కుకున్న పొలాలే.. సాక్షాత్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోనిదీ చిత్రం. గత ఏడాది సెప్టెంబర్ నెలలో ఏలేరు వరద నీరు ఒక్కసారిగా వెల్లువెత్తి, విరుచుకుపడింది. కూటమి ప్రభుత్వ అసమర్థత కారణంగా ఏలేశ్వరం జలాశయం నుంచి ఒకేసారి పెద్ద మొత్తంలో నీటిని వదిలేయడంతో పరీవాహక ప్రాంతంలోని గ్రామాలు అతలాకుతలమయ్యాయి. వేలాది ఎకరాల్లో పంటలను వరద ముంచెత్తింది. పెద్ద ఎత్తున బురదతో కూడిన వరద నీరు రావడంతో పొలాల్లో మట్టి మేటలు వేసింది. ఈ విపత్తు జరిగి ఇప్పటికి అక్షరాలా ఆరు నెలలైంది. వేలాది మంది రైతులు భారీగా నష్టపోయారు. అప్పుల పాలయ్యారు. ప్రభుత్వం పరిహారం ఇచ్చామని చెప్పిందే.. **తప్ప ఇప్పటికీ తమకు నయాపైసా అందలేదని చాలా మంది బాధిత రైతులు ఆవేదన చెందుతున్నారు.**

పంట భూమిలో ఇసుక మేటలు



ఇది ఏ నదీ తీరానికి సంబంధించిన ఫొటో అని అనుకుంటే పొరపాటు పడినట్లే.. గత ఏడాది సెప్టెంబర్‌లో వచ్చిన వరదల కారణంగా పిఠాపురం మండలం రాపర్తి గ్రామం వద్ద ఏలేరు కాలువకు పడిన గండ్లతో పొలాల్లో ఇసుక, మట్టి ఇలా మేటలు వేసింది. ఇలా పొలాల్లో మేటలు వేసిన ఇసుక, మట్టిని తొలగించుకోవడానికి హెక్టారుకు రూ.17 వేల చొప్పున ఇస్తామని కూటమి ప్రభుత్వం గొప్పగా ప్రకటించింది. **కానీ, ఆవిధంగా ఆర్థిక సాయం అందలేదని చాలా మంది రైతులు వాపోతున్నారు.**

అన్నదాతలతో పరిహాసం

- **గత సెప్టెంబర్‌లో వెల్లువెత్తిన ఏలేరు**
- **వేల ఎకరాల్లో నీట మునిగిన పంటలు**
- రైతులకు రూ.కోట్లలో నష్టం
- నెలలు గడుస్తున్నా అందని పరిహారం
- వరద నీట కొట్టుకుపోయిన కూటమి నేతల హామీలు



ఏలేరు వరదలకు కుళ్లిపోయిన పంటలు (ఫైల్)

పిఠాపురం: అధిక వర్షాల కారణంగా గత ఏడాది సెప్టెంబర్ నెలలో జిల్లాలోని ఏలేరు, పంపా, సుద్దగెడ్డ, తాండవ నదులకు ఊహకందని రీతిలో వరదలు వచ్చాయి. వరదలు, అధిక వర్షాల కారణంగా జగ్గంపేట, పెద్దాపురం, కిర్లంపూడి, తాళ్లరేవు, సామర్లకోట, పిఠాపురం, తొండంగి, గొల్లప్రోలు, కొత్తపల్లి, తుని తదితర 20 మండలాల్లో సుమారు లక్ష ఎకరాల్లో వివిధ రకాల పంటలు వరద నీట మునిగి సర్వనాశనమయ్యాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం రైతులు సుమారు రూ.200 కోట్లకు పైగా నష్టపోయారు. ముఖ్యంగా వేలాది ఎకరాల్లో పచ్చని పంటలకు ఊపిరి పోసే ఏలేరు.. తన ఆయకట్టు భూములపై ప్రతాపం చూపింది. పరీవాహక ప్రాంతంలో విస్తారంగా కురిసిన వర్షాలకు జలాశయంలోకి ఇన్‌ఫ్లో గణనీయంగా పెరిగింది. దీనిని అంచనా వేసుకుంటూ, జలాశయం నుంచి తగిన స్థాయిలో దిగువకు నీటిని వదలాల్సి ఉండగా.. అధికారులు ఒక్కసారిగా పెద్ద మొత్తంలో నీటిని విడిచిపెట్టారు. ఆ రోజుల్లో 10 వేల క్యూసెక్కుల లోపే అదనపు జలాలను విడిచిపెడుతున్నట్లు అధికారులు చెప్పగా.. వాస్తవానికి అంతకు పదింతల మొత్తంలో నీటిని రోజుల తరబడి వదిలేశారని స్థానికులు చెబుతున్నారు. ఫలితంగా ఒక్కసారిగా ఏలేరు జలాలు ఉరకలెత్తి విరుచుకుపడ్డాయి. వేలాది ఎకరాల్లో పంటలు, పరీవాహక ప్రాంతంలోని గ్రామాలు జలమయమయ్యాయి. ఏలేరు నదికి సుమారు 200కు పైగా గండ్లు పడ్డాయి. సుమారు 200 ఎకరాల పంట భూముల్లో ఇసుక, మట్టి మేటలు వేశాయి. పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి.

అప్పట్లో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. రైతులను, వరద బాధితులను పరామర్శించారు. వారిలో మనోధైర్యం నింపి, బాధితులను వెంటనే ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వరద ప్రభావిత ప్రాంతాల్లో హడావుడిగా మొక్కుబడి పర్యటనలు చేశారు. బాధితులకు తక్షణం పరిహారం ఇస్తామంటూ హామీలిచ్చారు. కానీ, ఆ మాటలు పరిహాసంగానే మిగిలాయి. నెలలు గడుస్తున్నా తమకు నష్టపరిహారం అందలేదని వేలాది మంది రైతులు వాపోతున్నారు. పరిహారం ఇచ్చామని చెబుతున్నారు తప్ప ఎంత మందికి ఇచ్చారు, ఎంత ఇచ్చారనే లెక్కలు మాత్రం ప్రభుత్వం ఇప్పటికీ బహిర్గతం చేయడం లేదు. అటు ప్రభుత్వాధినేతలూ పట్టించుకోవడం మానేశారు. దీంతో పంటలు నష్టపోయి, పరిహారం అందక ఏలేరు రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

జిల్లాలో ఏలేరు వరద నష్టాలు ఇలా..

అధికారుల ప్రాథమిక అంచనా	
వరద ప్రభావిత మండలాలు	20
ముంపులో చిక్కుకున్న గ్రామాలు	206
నీట మునిగిన పంటల విస్తీర్ణం	సుమారు 1,00,000 ఎకరాలు
మట్టి మేటలు వేసిన పొలాలు	సుమారు 200 ఎకరాలు
దెబ్బ తిన్న పంటలు	వరి, మొక్కజొన్న, పత్తి, మినుము
నష్టపోయిన రైతులు	సుమారు 50,000
పంట నష్టం	సుమారు రూ.200 కోట్లు
ప్రభుత్వానికి అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం..	
నీట మునిగిన పంటల విస్తీర్ణం	75,000 ఎకరాలు
నష్టపోయిన రైతులు	41,796
పంట నష్టం అంచనా	రూ.172 కోట్లు
ప్రభుత్వం కుదించిందిలా..	
పంట నష్టం	34,812 ఎకరాలు
నష్టపోయిన రైతులు	24,879

ఎకరానికి రూ.10 వేల ఇన్‌పుట్ సబ్సిడీ, ఇసుక మేటలు తొలగించుకోవడానికి హెక్టార్‌కు రూ.17 వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

పరిహారం లేదు.. పట్టించుకునే వారూ లేరు

సార్వాలో రెండెకరాల్లో వరి పంట వరదకు కొట్టుకుపోయింది. ఇసుక మేటలు వేశాయి. ఇప్పటి వరకూ పైసా కూడా పరిహారం రాలేదు. ఇసుక మేటలు తొలగించడానికి ఆర్థిక సాయం చేస్తామన్నారు. అదీ లేదు. నా పొలానికి ఎదురుగా ఉన్న గొర్రిఖండి కాలువకు గండి కూడా పడింది. దానిని సగం పూడ్చి వదిలేశారు. ఫలితంగా దాళ్వా పంట కూడా సాగు చేసే పరిస్థితి లేకుండా పోయింది.

– పడాల అచ్చారావు (బాబూరావు), రైతు, గొల్లప్రోలు

పరిహారం ఊసెత్తడం లేదు

ఏలేరు వరదలు, అధిక వర్షాల వల్ల మా పంటలు **పోయాయి. అ**ప్పట్లో అధికారులు వచ్చి నష్టం నిర్ధా**రించారు. ప్రభు**త్వానికి నివేదికలు పంపాం.. పరి**హారం వస్తుంద**ని చెప్పారు. నెలలు గడుస్తున్నా పరి**హారం మాత్ర**ం రాలేదు. ఎవరూ ఆ ఊసెత్తడం **లేదు. ఎవరిని** అడగాలో కూడా తెలియని అయో**మయ పరిస్థితి** మాది.

– ధర్మారపు లక్ష్మీకుమారి, రైతు, యండపల్లి, కొత్తపల్లి మండలం

వేశామంటున్నారు.. మాకు రాలేదు

మాకు సంబంధించి మూడెకరాల్లో పంట వరదలో కొట్టుకుపోయింది. పంట పూర్తిగా దెబ్బ తిన్నట్లు అధికారులు గుర్తించారు. నష్ట పరిహారం వస్తుందని అప్పట్లో చెప్పారు. తరువాత పరిహారం వేశామని కూడా అంటున్నారు. కానీ మాకు మాత్రం ఒక్క రూపాయి కూడా పడలేదు. అడుగుతూంటే ఎవరూ సమాధానం చెప్పడం లేదు. అసలు వస్తుందో రాదో కూడా తెలియని అయోమయ పరిస్థితిలో మేమున్నాం.

– మొగలి అప్పలరాజు, రైతు, యండపల్లి, కొత్తపల్లి మండలం

పరిహారం గురించి పట్టించుకోవడం లేదు

పంటలు దెబ్బతిని, తీవ్రంగా నష్టపోయి ఇబ్బందుల్లో ఉన్న మమ్మల్ని ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. నష్టపరిహారం వేశారని అధికారులు ప్రచారం చేస్తున్నారు. కానీ ఎవరికి వేశారో, ఎంత వేశారో చెప్పడం లేదు. ఎవరిని అడిగినా రాలేదనే అంటున్నారు. మాకు రాలేదు. అధికారులను ఎన్నిసార్లు అడిగినా సమాధానం లేదు.

– దువ్వా జయలక్ష్మి, రైతు, యండపల్లి, కొత్తపల్లి మండలం

శ్రీరామ నవమి వేడుకలకు శ్రీకారం

అన్నవరం: రత్నగిరి క్షేత్ర పాలకుడు శ్రీ సీతారామచంద్ర స్వామి వారి శ్రీరామ నవమి వేడుకలకు శ్రీకారం చుట్టారు. రత్నగిరిపై రామాలయం వద్ద గురువారం ఉదయం పండితులు పందిరి రాట వేశారు. తొలుత పందిరి రాటకు పసుపు రాసి, కుంకుమ బొట్లు పెట్టి, పూలతో అలంకరించి, పూజలు చేశారు. అనంతరం సుస్వర వేద మంత్రోచ్చారణ నడుమ రాట వేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు, అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహనరావు తదితరులు పందిరి రాటకు పూజలు చేశారు. కార్యక్రమంలో వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు ఇంద్రగంటి నరసింహమూర్తి, రామాలయ అర్చకుడు దేవులపల్లి వరప్రసాద్, స్పెషల్ గ్రేడ్ వ్రత పురోహితుడు చామర్తి కన్నబాబు, పురోహితుడు పాలంకి పట్టాభి తదితరులు పాల్గొన్నారు.



పందిరి రాట కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ రోహిత్, ఈఓ సుబ్బారావు

రేపటి నుంచి శ్రీరామ నవమి వేడుకలు

ఈ నెల ఐదో తేదీ నుంచి 13వ తేదీ వరకూ తొమ్మిది రోజుల పాటు శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. సీతారాముల కల్యాణ మహోత్సవాలను సాక్షాత్తూ సత్యదేవుడు, అమ్మవారు పెళ్లిపెద్దలుగా వ్యవహరించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నెల 5వ తేదీ సాయంత్రం 4 గంటలకు సీతాదేవి, శ్రీరామచంద్రమూర్తిని వధూవరులుగా అలంకరించడంతో శ్రీరామ నవమి వేడుకలు ప్రారంభమవుతాయి. శ్రీరామ నవమి సందర్భంగా ఆరో తేదీ ఉదయం 10 గంటల నుంచి సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహిస్తారు. 7న ప్రత్యేక పూజలు, 8న పండిత సదస్యం, 9, 10 తేదీల్లో సీతారాములకు ప్రత్యేక పూజలు, 11న సీతారాముల వనవిహారోత్సవం, 12న శ్రీచక్రస్నానం, దండియాడింపు నిర్వహిస్తారు. 13వ తేదీ రాత్రి రామాలయంలో నిర్వహించే శ్రీపుష్పయాగంతో కార్యక్రమాలు ముగుస్తాయి.

రూ.171.33 కోట్లతో అన్నవరం దేవస్థానం బడ్జెట్

అన్నవరం: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గానూ అన్నవరం వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి రూ.171.33 కోట్లతో వార్షిక బడ్జెట్‌ను ఆమోదిస్తూ రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఇందులో నిర్వహణ వ్యయం కింద రూ.46.25 కోట్లు, వివిధ కొనుగోళ్లకు రూ.31.20 కోట్లు, సీజీఎఫ్, ఆడిట్ ఫీజు ఇతర చెల్లింపులకు రూ.23 కోట్లు, భక్తుల సదుపాయాలకు రూ.7.64 కోట్లు, స్వామివారి కల్యాణ, ఇతర ఉత్సవాలకు రూ.1.5 కోట్లు చొప్పున కేటాయించారు.

కేటాయింపులు ఇలా..

- సిబ్బంది జీతాలకు రూ.18 కోట్లు, అర్చకులు, వేద పండితుల జీతాలకు రూ.6 కోట్లు, విశ్రాంత ఉద్యోగుల పెన్షన్లకు రూ.13.50 కోట్లు, కాంట్రాక్ట్, కన్సాలిడేటెడ్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలకు రూ.9 కోట్లు.
- ప్రసాదం తయారీలో వాడే నెయ్యి, పంచదార, గోధుమ నూక, వంట గ్యాస్ తదితర కొనుగోళ్లకు రూ.25 కోట్లు, వ్రతాలు, ఇతర ఆర్జిత సేవలకు అవసరమయ్యే సరకుల కొనుగోళ్లకు రూ.5 కోట్లు, ఇతర పూజా సామగ్రి కొనుగోళ్లకు రూ.1.15 కోట్లు.
- వ్రత పురోహితులకు చెల్లించే పారితోషికాలకు రూ.16 కోట్లు, ప్రసాదం ప్యాకర్లకు రూ.2.10 కోట్లు, నాయీబ్రాహ్మణులకు రూ.1.60 కోట్లు.
- దేవస్థానంలో శానిటేషన్‌కు రూ.7.50 కోట్లు, షామియానా, పందిళ్లకు రూ.14 లక్షలు.
- ఎలక్ట్రికల్ వర్క్స్, వాటర్ సప్లై తదితర వాటికి రూ.1.55 కోట్లు, సోలార్ ప్లాంట్ నిర్వహణకు రూ.10 లక్షలు.
- దేవస్థానం నిర్వహిస్తున్న విద్యాసంస్థలకు రూ.3.75 కోట్లు, దత్తత ఆలయాల నిర్వహణకు రూ.90 లక్షలు, ఆగమ పాఠశాలకు రూ.30 లక్షలు, దేవస్థానం ఆసుపత్రి నిర్వహణ, మందుల కొనుగోలుకు రూ.8 లక్షలు.
- స్పెషల్ సెక్యూరిటీ ఫోర్స్‌కు రూ.2.25 కోట్లు, సెక్యూరిటీ గార్డులకు రూ.2 కోట్లు, హోంగార్డులకు రూ.1.10 కోట్లు.
- సీజీఎఫ్ తదితర చెల్లింపులకు రూ.7.20 కోట్లు, సెక్షన్–65 ఈఏఎఫ్ కింద రూ.10 కోట్లు, ఆడిట్ ఫీజు రూ.1.20 కోట్లు, అర్చక సంక్షేమ నిధికి రూ.2.4 కోట్లు, ప్రభుత్వ ట్యాక్స్‌లకు రూ.2.5 కోట్లు.
- ఇంజినీరింగ్ పనులకు రూ.4 కోట్లు, ఎలక్ట్రికల్ సామగ్రి కొనుగోళ్లకు రూ.కోటి, కొత్త వాహనాల కొనుగోలుకు రూ.కోటి.



- సిబ్బందికి వివిధ అడ్వాన్స్‌లు, రుణాలకు రూ.70 లక్షలు.
- కొత్త డిపాజిట్లు రూ.3 కోట్లు. మెచ్యూర్ అయిన డిపాజిట్లు తిరిగి జమ చేయడానికి రూ.కోటి, ఈఎండీ చెల్లింపులు రూ.కోటి.
- దేవస్థానం ట్రాన్స్‌పోర్టు నిర్వహణకు రూ.1.16 కోట్లు.
- సత్యదేవుని నిత్యాన్నదాన ట్రస్ట్‌లో భక్తులకు భోజనాలు పెట్టేందుకుగాను వివిధ దినుసుల కొనుగోలుకు రూ.3.30 కోట్లు, కూరగాయల కొనుగోలుకు రూ.కోటి, పాలకు రూ.60 లక్షలు, గ్యాస్‌కు రూ.55 లక్షలు, జీతాలకు రూ.కోటి, ఇతర ఖర్చులకు రూ.11.70 లక్షలు.
- గో సంరక్షణ ట్రస్ట్‌లో ఆవుల మేత, దాణాలకు రూ.20 లక్షలు, వైద్య ఖర్చులకు రూ.లక్ష, సిబ్బంది జీతాలకు రూ.31 లక్షలు.

ఉన్న నీరు ఆవిరి



డెడ్ స్టోరేజీకి చేరిన పంపా రిజర్వాయర్

- డెడ్ స్టోరేజీకి పంపా రిజర్వాయర్
- 80 అడుగులకు పడిపోయిన నీటిమట్టం
- ప్రస్తుతం 0.007 టీఎంసీలకు తగ్గిన నీటినిల్వలు

అన్నవరం: పంపా రిజర్వాయర్‌లో ఉన్న కొద్దిపాటి నీరు కొద్ది రోజులుగా కాస్తున్న ఎండలకు ఆవిరైపోతోంది. దీంతో నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరుకుంది. జలాశయంలో ఎటు చూసినా ప్రస్తుతం మట్టి దిబ్బలే కనిపిస్తున్నాయి. పంపా రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 103 అడుగులు. ఆ స్థాయిలో 0.43 టీఎంసీల నీటిని గరిష్ఠంగా నిల్వ చేయవచ్చు. రిజర్వాయర్ డెడ్ స్టోరేజీ నీటిమట్టం 80 అడుగులు కాగా, ఆ స్థాయిలో 0.007 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంటుంది. ఈ స్థాయికి బుధవారమే పంపా రిజర్వాయర్ చేరుకుంది. దీంతో, అన్నవరం దేవస్థానానికి, గ్రామానికి నీటి సమస్య ఏర్పడే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే, డెడ్ స్టోరేజీకి చేరిన 10 రోజుల వరకూ ఇబ్బంది ఉండదని జల వనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

గత ఐదేళ్లలో పుష్కలంగా..

పంపా నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరడం గడచిన ఐదేళ్లలో ఇదే ప్రథమం. 2019లో నీటిమట్టం తగ్గినప్పటికీ డెడ్ స్టోరేజీ స్థాయికి పడిపోలేదు. 2020, 2021, 2022, 2023 సంవత్సరాల్లో పంపా రిజర్వాయర్ నుంచి ఖరీఫ్‌తో పాటు జనవరి నుంచి ఏప్రిల్ వరకూ రెండో పంట రబీకి కూడా నీరు ఇచ్చారు. అప్పట్లో పంపాకు ఏలేరు, పుష్కర నుంచి నీరు విడుదల చేశారు. ఫలితంగా పంపా నీటిమట్టం ఏడాది పొడవునా 90 అడుగులకు తగ్గకుండా కొనసాగేది. గడచిన నాలుగేళ్లు శ్రీరామ నవమి, సత్యదేవుని కల్యాణోత్సవాల సందర్భంగా చక్రస్నాన మహోత్సవాలకు పుష్కలంగా నీరుంది. గత ఏడాది నీటిమట్టం తగ్గడంతో అప్పటి ఈఓ కె.రామచంద్ర మోహన్ ఏలేరు నుంచి పంపాకు నీరు విడుదల చేయాలని కలెక్టర్‌కు లేఖ రాశారు. ఆ మేరకు ఏప్రిల్ 13 నుంచి ఏలేరు నీటిని విడుదల చేశారు. గత ఏడాది రత్నగిరిపై శ్రీరామ నవమి వేడుక ఏప్రిల్ 17న జరిగింది. పంపాలో శ్రీరాముని చక్రస్నానం ఏప్రిల్ 23న నిర్వహించారు. అప్పటికే ఏలేరు నీరు రావడంతో చక్రస్నాన మహోత్సవం నాలుగడుగుల లోతు నీటిలో ఘనంగా నిర్వహించారు. గత ఏడాది మే నెలలో జరిగిన సత్యదేవుని కల్యాణ మహోత్సవాలకు కూడా నీటి సమస్య ఏర్పడలేదు.

ఈ ఏడాది సమస్య తీవ్రం

ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పంపా జలాశయం అడుగంటడంతో ఈ నెల రెండో తేదీకే తీవ్ర నీటి సమస్య ఏర్పడింది. దేవస్థానం అధికారులు ఆలస్యంగా మేల్కొని నీటి సమస్యను మార్చి 11న కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టర్ షణ్మోహన్ దఫదఫాలుగా పరిశీలించిన అనంతరం రూ.22 లక్షల వ్యయంతో పోలవరం అక్విడెక్ట్ ఎగువన కాలువ నిర్మించి, పైపులు వేసి పంపాకు ఏలేరు నీటిని తరలించాలని నిర్ణయించారు. ఈ పనులన్నీ పూర్తవడానికి ఈ నెల 15 డెడ్‌లైన్‌గా నిర్ణయించారు. ఆ రోజుకు ఏలేరు నీరు పంపాకు రాకపోతే ఇబ్బంది తప్పదనే ఆందోళన నెలకొంది.

చక్రస్నానానికి ఏర్పాట్లు

శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 12న శ్రీరాముని చక్రస్నానానికి ఏర్పాట్లు చేస్తున్నారు. పంపా జలాశయం ఒడ్డున పవర్ హౌస్ వద్ద కోనేరులా నిర్మించి, దానిలోకి నదిలో మిగిలిన నీటిని మళ్లిస్తున్నారు. ఆ కోనేరులోనే చక్రస్నానం నిర్వహిస్తారు. మే నెలలో జరిగే సత్యదేవుని కల్యాణ మహోత్సవాలకు ఏలేరు నీరు వస్తే చక్రస్నానానికి ఇబ్బంది ఉండదని దేవస్థానం అధికారులు తెలిపారు.

పది రోజుల వరకూ ఫర్వాలేదు



పంపా నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరినా పది రోజుల వరకూ నీటి సమస్య ఉండదు. పంపా నదీగర్భంలో అక్కడక్కడ ఉన్న గోతుల్లో సుమారు 7 ఎంసీఎఫ్‌టీ (సుమారు 20 లక్షల లీటర్లు) నీరు ఉంటుంది. ఇది పది రోజుల వరకూ వస్తుంది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 15వ తేదీకల్లా పోలవరం అధికారులు కాలువ, పైప్‌లైన్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఆ తరువాత ఏలేరు నీటిని పంపాకు విడుదల చేయిస్తాం.

– జి.శేషగిరిరావు, ఇరిగేషన్ ఈఈ


పరీక్ష కేంద్రాల్లో 'నన్నయ' వీసీ తనిఖీ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆదికవి నన్నయ యూనివర్సిటీ నిర్వహిస్తున్న డిగ్రీ, బీఈడీ, లా పరీక్ష కేంద్రాలను ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరంలోని వీఎస్ లక్ష్మీ మహిళా కళాశాల, ప్రగతి డిగ్రీ కళాశాలను సందర్శించారు. పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 109 కేంద్రాల్లో 22 వేల మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాస్తున్నారని ఈ సందర్భంగా తెలిపారు. వేసవి నేపథ్యంలో ఎటువంటి అసౌకర్యం లేకుండా, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా యాజమాన్యాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వీసీ ప్రసన్నశ్రీ సూచించారు.



పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఆచార్య ప్రసన్నశ్రీ

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	15,500
గటగట (వెయ్యి)	14,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	14,500
గటగట (వెయ్యి)	13,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

టోల్ బాజా!

- పెరిగిన రుసుం చెల్లింపులు
- మార్చి 31 అర్ధరాత్రి నుంచి అమల్లోకి
- నెలవారీ పాస్‌లనూ వదలని ఎన్‌హెచ్‌ఏఐ
- వాహనదారులపై రోజుకు రూ.2.5 లక్షల భారం

అలమూరు: జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనాల రుసుం వసూలు కోసం ఏర్పాటు చేసిన చేసిన టోల్‌ప్లాజాల వద్ద మరోసారి బాదుడు ప్రారంభమైంది. టోల్‌గేట్ రహితంగా భారతదేశాన్ని తీర్చిదిద్దుతామన్న కేంద్ర ప్రభుత్వ హామీ నెరవేరక పోగా వాహనదారులపై ఏటా పెను భారం మోపనుంది. గత ఏడాది జూన్ ఒకటిన టోల్ ధరలను పెంచగా ఏడాది గడవకుండానే మళ్లీ ఈ ఏడాది మార్చి 31 అర్ధరాత్రి నుంచి పెంచేశారు. అన్ని రకాల వాహనదారులకు రుసుముల మోత మోగిస్తూ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) నిర్ణయం తీసుకుంది. జాతీయ రహదారుల్లో ఇష్టానుసారం టోల్‌ప్లాజాలను ఏర్పాటు చేసి రుసుములను పెంచడంతో వాహనదారులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. టోల్‌ప్లాజా సిబ్బందితో వాహనదారులు ఘర్షణ పడటం నిత్యకృత్యమై పోయింది. వాహనదారుల నుంచి భారీ స్థాయిలో రుసుములు వసూలు చేస్తున్న టోల్‌ప్లాజా నిర్వాహకులు వాటికి తగ్గట్టుగా సౌకర్యాలు కల్పించకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 216, 216ఏ జాతీయ రహదారులు ఉన్నాయి. కాకినాడ జిల్లాలోని కత్తిపూడి నుంచి కృష్ణా జిల్లాలోని పామర్రు వరకూ 216 జాతీయ రహదారి ఉండగా ఏలూరు జిల్లాలోని గుండుగొలను నుంచి వయా పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, తణుకు, కోనసీమ జిల్లాలోని రావులపాఎలం మీదుగా తూర్పు గోదావరి జిల్లా దివాన్ చెరువు వరకూ 216ఏ జాతీయ రహదారి విస్తరించింది.

జిల్లాలో రెండు టోల్‌ప్లాజాల ఏర్పాటు

కోనసీమ జిల్లాలోని 216 జాతీయ రహదారిలోని ముమ్మిడివరం మండలంలోని అన్నంపల్లి వద్ద, 216 ఏ జాతీయ రహదారిలోని రావులపాలెం మండలం ఈతకోట వద్ద ఎన్‌హెచ్‌ఏఐ రెండు టోల్‌గేట్లను ఏర్పాటు చేసింది. ఈ రెండు టోల్‌గేట్ల నుంచి ప్రతి రోజు సుమారు 12 వేల వరకూ వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా దాదాపు రూ.32 లక్షల వరకూ టోల్ రుసుం ద్వారా ఆదాయం లభిస్తుంది. ఈతకోటలో ఏర్పాటు చేసిన టోల్ గేట్ ద్వారా ప్రతి రోజు సుమారు 6,500 వాహనాలు, అన్నంపల్లిలో ఏర్పాటు చేసిన టోల్‌గేట్ మీదుగా రోజూ దాదాపుగా 5,500 వాహనాల వరకు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రయాణించే వాహనాల యాక్సిల్‌ను బట్టి కిలోమీటరుకు ఐదు పైసల నుంచి 34 పైసల వరకూ పెంపు జరిగింది. అలాగే ఈతకోట వద్ద కారు, జీపులకు కనీసం రుసుం రూ.ఐదు నుంచి గరిష్టంగా రూ.40 వరకూ పెరగ్గా అన్నంపల్లి వద్ద రూ.ఐదు నుంచి రూ.20 వరకూ పెరిగింది. ఈ ఆర్థిక సంవత్సరంలో టోల్ రుసుం పెంపు ద్వారా రోజుకు మరో రూ 2.5 లక్షల మేర వాహనదారులు అదనంగా చెల్లించవలసిన పరిస్థితి ఏర్పడింది. వాహనాలకు ఫాస్ట్ ట్యాగ్ లేకపోతే నగదు రూపంలో రెట్టింపు రుసుం వసూలు చేయడం విమర్శలకు తావిస్తోంది. టోల్‌ప్లాజా పరిసరాల్లో నివసిస్తున్న స్థానికుల వాహనాలకు మంజూరు చేసే పాస్ రుసుమును రూ.340 నుంచి రూ.350కు పెంచారు.

టోల్‌ప్లాజాల వద్ద సౌకర్యాలు అంతంతే

ఎన్‌హెచ్‌ఏఐ నిబంధనల ప్రకారం టోల్‌ప్లాజాల వద్ద అనేక సౌకర్యాల కల్పన జరగవలసి ఉంది. వాహన చోదకులు విశ్రాంతి గదులు, తాగునీరు, పురుషులకు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి. వాహనదారులకు ఏవిధమైన సమస్య వచ్చినా సత్వరమే అత్యవసర సేవలు అందించేందుకు ప్రత్యేక యంత్రాంగం అందుబాటులో ఉండాలి. ఫాస్ట్ ట్యాగ్ ఉన్న వాహనాలను కేవలం పది సెకన్ల లోపే దాటించాలి. ఏమాత్రం సమయం దాటినాఆ వాహనానికి టోల్‌రుసుం వసూలు చేయకూడదనే నిబంధన ఉన్నా ఎక్కడా అమలు కావడం లేదని వాహనదారులు చెబుతున్నారు.



ఈతకోట టోల్‌ప్లాజా



ఈతకోట టోల్‌ప్లాజా వద్ద పాత రుసుం



ఈతకోట టోల్‌ప్లాజా వద్ద కొత్త రుసుం

టోల్ రుసుము పెంపు ఇలా.. (ప్రతి కి.మీ.)

వాహనం పేరు	పాత రుసుం (రూ.ల్లో)	కొత్త రుసుం (రూ.ల్లో)	పెంపు (పైసలు)
కారు/జీపు (సింగిల్ యాక్సిల్)	1.46	1.51	05
బస్సు/లారీ (డబుల్ యాక్సిల్)	4.96	5.14	18
బస్సు/లారీ (త్రిబుల్ యాక్సిల్)	5.41	5.60	19
భారీ వాహనాలు	7.78	8.06	26
అతి భారీ వాహనాలు	9.47	9.81	34

టోల్ ఎగ్గొట్టేందుకు అడ్డదారులు



కృష్ణవరంలో ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

కిర్లంపూడి: టోల్ ఫీజులు ఎగ్గొట్టేందుకు అడ్డదారుల్లో గ్రామాల మధ్యలోంచి వెళ్లేందుకు భారీ వాహనాల డ్రైవర్లు వెనుకాడడంలేదు. మండల పరిధి కృష్ణవరంలోని టోల్‌గేట్ వద్ద ఫీజు ఎగ్గొట్టేందుకు బూరుగుపూడి ఊరు శివారున పోలవరం కాలువ గట్టు మీదుగా కృష్ణవరం ఊరు మధ్యలో నుంచి సుమారు 60–65 టన్నుల ఇసుక లోడుతో నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలు వెళుతున్నాయి. దీంతో కృష్ణవరంలోని గ్రామస్తులు గురువారం లారీలను అడ్డుకున్నారు. భారీ ఇసుక లారీలు గ్రామం మధ్యలో నుంచి వేగంగా వెళ్లడంతో ఏ సమయాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే మార్గంలో ఎంపీపీ ప్రభుత్వ పాఠశాల ఉండడంతో విద్యార్థులకు ఏ ముప్పు వాటిల్లుతుందోనని పలువురు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు సామర్థ్యాన్ని మించి ఇసుక లోడులు వెళ్లడం వల్ల సీసీ రోడ్డు పాడైపోతుందన్నారు. దీంతో పాటు ఇళ్లల్లోకి దుమ్ముధూళి రావడంతో పాటు ఇళ్ల గోడలు బీటలు వారుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామాల్లోంచి లారీల రవాణాను ఆపకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

అనుమతుల్లేని క్వారీలో యంత్రాల సీజ్



అనుమతి లేకుండా తవ్వుతున్న యంత్రాలను సీజ్ చేసిన అధికారులు

రౌతులపూడి: మండలంలోని ములగపూడిలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న నల్లరాయి క్వారీల్లో మైనింగ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో సర్వే నంబరు-1లో ప్రభుత్వ అనుమతులు పొందకుండా నిర్వహిస్తున్న నల్లరాయిని అధికారులు గుర్తించారు. ఈ క్వారీలో పనిచేస్తున్న ఒక కంప్రెసర్, డ్రిల్లింగ్ మెషీన్, 323 పొక్లెయిన్‌ను సీజ్‌చేసి స్వాధీనం చేసుకున్నట్లు మైనింగ్ ఆర్ఐ మురళీకృష్ణ తెలిపారు. స్వాధీనం చేసుకున్న యంత్రాలను స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామని చెఅప్పరు. ఆర్ఐ పట్నాయక్, వీఆర్ఓ శ్రీను, మైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

అంబాజీపేట: భార్యాభర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా గురువారం తెల్లవారుజామున ఓ వ్యక్తి తన ఇంటిలోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. దీనికి సంబంధించి ఎస్సై కె.చిరంజీవి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అంబాజీపేట లీజర్ కాలనీకి చెందిన రొక్కాల మోజేష్ (34) తన భార్యతో మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో అతని భార్య వారం రోజుల క్రితం తన పుట్టింటికి అల్లవరం మండలం తుమ్మలపల్లి వెళ్లి పోయింది. దీంతో అతను మనస్థాపానికి గురయ్యాడు. తన ఏడాదిన్నర కుమార్తెకు ఐ మిస్‌యూ బంగారు తల్లి అని స్టేటస్ పెట్టుకున్నాడు. అనంతరం తన బెడ్‌రూమ్‌లో ఉన్న ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. మోజెష్ ఇంకా నిద్ర లేవ లేదా అంటూ స్థానికులు కిటికిలోంచి చూసే సరికి విగత జీవిగా ఉన్నాడు. దాంతో మృతుడి ఇంటి తలుపులు పగులకొట్టి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. ఘటనా స్థలాన్ని ఎస్సై కె.చిరంజీవి పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.



రొక్కాల మోజేష్ (ఫైల్)

చికిత్స పొందుతూ ఎంపీటీసీ సభ్యురాలి భర్త మృతి

ఏలేశ్వరం: గత నెల 20న మండల పరిధిలోని తిరుమాలిలో జరిగిన రోడ్డుప్రమాదంలో గెద్దనాపల్లి ఎంపీటీసీ సభ్యురాలు బొడ్డేటి నాగలక్ష్మి భర్త గోవిందు(39) గురువారం చికిత్స పొందుతూ మృతిచెందారు. పోలీసుల వివరాల ప్రకారం కిర్లంపూడి మండలం గెద్దనాపల్లికి చెందిన గోవింద్ బెల్లం వ్యాపారం కోసం గత నెల 20న మోటారుబైక్‌పై ఏలేశ్వరం వస్తుండగా మార్గమధ్యలో తిరుమాలి వద్ద ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు.



బొడ్డేటి గోవింద్

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

రాయవరం: ఇటీవల రాయవరం ఆలయంలో పట్టపగలు జరిగిన చోరీ ఘటనలో నిందితుడిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వివరాలను రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రాయవరం అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారి మెడలో మంగళసూత్రాలు చోరీ చేసిన నిందితుడు తోరాటి సాయివరప్రసాద్‌ను అరెస్ట్ చేశామన్నారు. రంగంపేట మండలం నల్లమిల్లికి చెందిన సాయివరప్రసాద్ మహేంద్రవాడ్ రోడ్డులో పాత హెచ్‌పీ గొడౌన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా, నిందితుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడు సాయివరప్రసాద్‌ను విచారించగా, నేరం అంగీకరించాడన్నారు. నిందితుడి వద్ద నుంచి బంగారు మంగళసూత్రంతో పాటుగా, బిక్కవోలు మండలం పందలపాక గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ చేసిన వెండి కిరీటం, వెండి చెవులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి అనపర్తి జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు. నేరం జరిగిన 48 గంటల్లో కేసును ఛేదించి, నిందితుడిని అరెస్ట్ చేసిన సీఐ దొరరాజు, ఎస్సై సురేష్‌బాబు, పీసీ జీవీ కుమార్‌ను జిల్లా ఎస్పీ అభినందించారు.

కోర్టులో దొంగతనం

కాకినాడ లీగల్: కాకినాడ కోర్టులో దొంగతనం జరగడం కలకలం రేపింది. కోర్టుల ప్రాంగణంలో పలు న్యాయస్థానాల్లో మూడు కోర్టులకు అనుసంధానం చేసి ఉన్న ఏసీల కాపర్ వైర్లను ఆగంతకులు బుధవారం రాత్రి కత్తిరించి ఎత్తుకెళ్లారు. కాకినాడ పోక్సో ప్రత్యేక న్యాయస్థానం, స్పెషల్ ప్రొహిబిషన్ ఎక్సైజ్, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు, నాలుగో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులకు సంబంధించి 14 ఏసీల కాపర్ వైర్లను దొంగలు ఎత్తికెళ్లినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆ కోర్టు సంబంధించిన న్యాయమూర్తులు కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవికి తెలియపరిచారు. ఇదే తరహాలో 2023లో జనవరి నెలలో కాకినాడ బార్ అసోసియేషన్‌లో ఏసీ కాపర్ వైర్ల దొంగతనం జరిగింది. అదే నెలలో కాకినాడ నాలుగో అదనపు జిల్లా జడ్జి కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, మొబైల్ మేజిస్ట్రేట్ కోర్టుల ఏసీల కాపర్ వైర్లను దొంగిలించారు.

గర్భిణి కిడ్నాప్ కలకలం

- పుట్టిన పిల్లలు మాయం
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం గర్భిణి కిడ్నాప్ తీవ్ర చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే దేవీపట్నం మండలం ఇందుకూరి పేటకు చెందిన కొప్పిశెట్టి దేవిని ప్రసవం కోసం ఆమె కుటుంబ సభ్యులు గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న కంటే దుర్గ ఆస్పత్రికి తీసుకువచ్చారు. కొద్ది సేపటికి ఆమె కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు ఆసుపత్రి సీసీ కెమేరాలు తనిఖీ చేసి ఆమె ఆసుపత్రి నుంచి నడుస్తూ వెళ్లిపోవడాన్ని గమనించారు. గోకవరం బస్టాండ్ వద్ద సీసీ కెమెరాల్లోను అలాగే కనిపించింది. కొద్ది సమయం తర్వాత ఆమె సామర్లకోట బస్‌స్టాండ్‌లో ఉన్నట్లు తెలిసింది. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు ఆమెను పట్టుకున్నారు. అయితే ఆమెకు ప్రసవం జరిగిపోయింది. తనను ఎవరో కారులో ఎక్కించుకున్నారని, ఇంజెక్షన్ చేశారని, తనకు పిల్లలు పుట్టారని, వారిని వారు ఎత్తుకువెళ్లిపోయారని చెబుతోంది. పోలీసులు ఆ దిశగా విచారణ చేస్తున్నారు. ఆమెను పోలీసులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సివుంది.

వెంకన్న కల్యాణోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

కొత్తపేట: వాడపల్లి వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలకు తరలివచ్చే భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఏర్పాట్లు చేసి, ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించాలని కోనసీమ జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ దేవదాయ శాఖ అధికారులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు సూచించారు. ఈ నెల 7 నుంచి 13 వరకు కళ్యాణోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై గురువారం ఆలయ ఆవరణలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దేవదాయ – ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కలెక్టర్ మహేష్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏడు రోజుల పాటు జరిగే అన్ని కార్యక్రమాలు ప్రధానంగా 8వ తేదీన జరిగే రథోత్సవం, రాత్రి జరిగే కల్యాణోత్సవం తిలకించడానికి లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ ఆలయం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నత శాఖల అధికారులతో చర్చించి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ బందోబస్తుకు అవసరమైన సిబ్బంది జాబితా సిద్ధం చేయాలని సబ్ డివిజన్ అధికారులకు సూచించారు. జాయింట్ కలెక్టర్ నిషాంతి, ఆర్డీఓ పి.శ్రీకర్, డీఎస్పీ సుంకర మురళీమోహన్ మాట్లాడుతూ తమ పరిధిలో తీసుకునే ఏర్పాట్లను, ముందస్తు చర్యలను వివరించారు. తహసీల్దార్ టి.రాజరాజేశ్వరరావు, ఎంపీడీవో బీకేఎస్ ఎస్‌వీ రామన్, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఎస్సై ఎస్.రాము, ఆర్ అండ్ బీ శాఖ డీఈఈ రాజేంద్ర, ఏఈ మణికుమార్, ఎలక్ట్రికల్ ఇంజినీర్ అశోక్, వాడపల్లి ఉప సర్పంచ్ పోచిరాజు బాబురావు, లొల్ల సర్పంచ్ కాయల జగన్నాథం, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



వాడపల్లిలో కల్యాణోత్సవాలపై సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

5, 6 తేదీల్లో రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలు

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో ఈ నెల 5,6 తేదీల్లో రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాజమహేంద్రవరం చార్టర్ అధ్యక్షుడు తీగెల రాజా, ఐకాన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇమ్మణి వెంకట్ చెప్పారు. గురువారం రాజమహేంద్రవరం క్లబ్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాదిలో ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ కుస్తీ పోటీలను తమ క్లబ్ తరపున రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కుస్తీ పోటీలను దక్షిణాదిలో కూడా పరిచయం చేయాలనే ఆశయంతో ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరంలో తొలిసారిగా నిర్వహిస్తున్నామన్నారు. అండర్–15 బాలబాలికలకు, అండర్–20 పురుషులు, మహిళలకు రాష్ట్ర స్థాయిలో రెజ్లింగ్ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. సుమారు 300 మంది రెజ్లర్స్ హాజరవుతారని చెప్పారు. ఈ పోటీల విజేతలు ఈ నెల 23న రాజస్థాన్‌లోని కోటాలో జరిగే జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. క్లబ్ స్పోర్ట్స్ చైర్మన్ మద్దూరి శంకర్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు ఈ రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలు దివాన్‌చెరువు ఎస్వీబీసీ కల్యాణ మండపంలో జరుగుతాయన్నారు. రెజ్లర్లకు ఉచిత భోజన వసతి సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో క్లబ్ కార్యదర్శి ఉదయగిరి సురేష్, కోశాధికారి కామేశ్వరిదేవి, స్పోర్ట్స్ డైరెక్టర్ పి.హెచ్.ఎస్.కార్తీక్, సంయుక్త కార్యదర్శి వంశీ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న తీగల రాజా, వెంకట్

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా విడుదల

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పాఠశాల విద్యాశాఖ పరిధిలో ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా విడుదల అయింది. జిల్లా, మండల, మున్సిపల్, కార్పొరేషన్ ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులకు ఈ జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమ సీనియారిటీకి సంబంధించిన ధ్రువీకరణ పొందిన ఆధారాలతో ఈ నెల 11వ తేదీలోగా కాకినాడ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

అవగాహన సదస్సుకు అనూహ్య స్పందన

తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు



సదస్సులో మాట్లాడుతున్న తిరుమల విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: కాతేరులో తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో గురువారం జరిగిన అవగాహన సదస్సుకు విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి అనూహ్య స్పందన లభించిందని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు అన్నారు. ఈ సదస్సుకు 18 వేలమంది హాజరయ్యారని ఆయన తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను మానసికంగానే కాకుండా శారీరకంగా కూడా దృఢంగా ఉండేలా సన్నద్ధం చేయాలని, అప్పుడే వారు వృద్ధులోకి వస్తారన్నారు. జాతీయస్థాయి పరీక్షలైన జేఈఈ (మెయిన్), జేఈఈ (అడ్వాన్స్‌డ్) అండ్ నీట్‌లలో తరచుగా విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు పుస్తకాలకన్నా ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కి ఎక్కువగా అలవాటు పడ్డారని, మొబైల్‌తో ఎక్కువ సమయం గడిపితే జరిగే నష్టం గురించి తల్లిదండ్రులు వివరించాలని తెలిపారు. పిల్లలకు ఇచ్చే ఆస్తి కేవలం విద్య మాత్రమేనని, తల్లిదండ్రులు ఎంతో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో దేశవ్యాప్తంగా జరిగే ఇంజినీరింగ్ (జేఈఈ మెయిన్స్ అండ్ అడ్వాన్స్)పరీక్షలలో 25మంది పరీక్ష రాస్తే కేవలం ఒక్కరికి మాత్రమే సీటు దొరుకుతుందని అదే తిరుమలలో ప్రతి నలుగురిలో ఒకరికి సీటు లభిస్తోందని చెప్పారు. మెడికల్‌లో దేశవ్యాప్తంగా జరిగే నీట్ పరీక్షల ప్రకారం 16మంది పరీక్ష రాస్తే కేవలం ఒకరికి సీటు లభిస్తుందని, అదే తిరుమలలో ప్రతి ముగ్గురిలో ఒకరికి మెడికల్ సీటు వస్తుందన్నారు. తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సరోజినిదేవి మాట్లాడుతూ పిల్లలకు తల్లిదండ్రులే మొదటి గురువులని వారిని చూసే ఎక్కువగా నేర్చుకుంటారని, కాబట్టి పిల్లల నడవడికను చిన్నప్పటి నుంచే తల్లిదండ్రులు తీర్చిదిద్దాలని అన్నారు. విజ్ఞానభారతి నేషనల్ సెక్రటరీ కొంపెల్ల సుబ్బరాయశాస్త్రి మాట్లాడుతూ పిల్లలు పుస్తకాలను ఎక్కువగా చదవాలని అప్పుడే వారికి జ్ఞాన సముపార్జన లభిస్తుందని అన్నారు. అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్ బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి పాల్గొన్నారు.

మీరు ఏదో మంచి చేస్తారని గెలిపించాం

- రాష్ట్రాన్ని ఉద్ధరిస్తారనుకున్నాం
- కేశనపల్లి సర్పంచ్ యెనుముల నాగు
- కార్పొరేషన్ లోన్లతో గ్రామాల్లో తలెత్తుకోలేని పరిస్థితి
- సీఎం, డిప్యూటీ సీఎంకు వీడియో సందేశం

మలికిపురం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు ఏదో చేస్తారని.. రాష్ట్రాన్ని ఉద్ధరిస్తారనుకుని.. మీరు చేసినా చేయకపోయినా మీ వెనుక ఉండి పార్టీని గ్రామాల్లో అభివృద్ధి పథంలో నడిపే వాళ్లమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా కేశనపల్లి సర్పంచ్, మలికిపురం మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు యెనుముల వీర వెంకట సత్య నాగేంద్రప్రసాద్ (నాగు) అన్నారు. ఈ మేరకు కాపు, బీసీ కార్పొరేషన్ రుణాల సమస్యలను వివరిస్తూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను ఉద్దేశిస్తూ గురువారం ఆయన సోషల్ మీడియాలో ఒక వీడియోను పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఆ వీడియో హాట్ టాపిక్‌గా మారింది.

మలికిపురం మండలంలోని 21 గ్రామాల్లో కాపు కార్పొరేషన్‌కు రుణాల కోసం 1,060 మంది దరఖాస్తు చేస్తే 44 మందికి మాత్రమే ఇచ్చారని, ఇది చాలా అన్యాయమని ఆ వీడియోలో పేర్కొన్నారు. కేశనపల్లిలో కాపు కార్పొరేషన్ రుణాల కోసం 70 మంది దరఖాస్తు చేసుకుంటే ఇద్దరికి మాత్రమే ఇవ్వడం దారుణమన్నారు. 'కార్పొరేషన్ లోన్ల గురించి మీరు చెబుతున్నారు. మేమే చెప్పు దెబ్బలు తింటున్నాం' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. గ్రామాల్లో కార్పొరేషన్ లోన్లు చాలా తక్కువగా ఇచ్చారనే బాధ ఉందని, రెండు కార్పొరేషన్ లోన్లు ఇచ్చిన మీరు 70 మందితో మమ్మల్ని తిట్టిస్తున్నారని దుయ్యబట్టారు. కార్పొరేషన్ లోన్ల విషయాన్ని చంద్రబాబు, పవన్ కల్యాణ్ పరిశీలించాలన్నారు. బీసీ కార్పొరేషన్ రుణాలకు 484 మంది దరఖాస్తులు పెట్టుకుంటే మండలంలో 65 మందికి ఇస్తామని చెబుతున్నారని, ఈ విషయాన్ని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు వివరిస్తే.. ఈ సమస్య తన పరిధిలో లేదని చెబుతున్నారన్నారు. 1994 నుంచి టీడీపీలో ఉన్నామని, గ్రామంలో పార్టీ నిర్వీర్యం కాకుండా కాపాడుకుంటూ వచ్చామని తెలిపారు. కార్పొరేషన్ రుణాల విషయంపై పునరాలోచన చేసి, సర్పంచ్‌లు తలెత్తుకుని తిరిగేలా చేయాలని కోరారు. కేశనపల్లిలో రెండు కాపు కార్పొరేషన్ రుణాలు, ఒక బీసీ కార్పొరేషన్ రుణం ఇస్తే మిగిలిన దరఖాస్తుదారులకు ఏం చెప్పాలో తెలియని పరిస్థితి నెలకొందని నాగు అన్నారు.



యెనుముల నాగు